క్లుప్తంగా

విద్యాభివృద్ధికి కృషిచేయాలి



ఎస్‌ఎంసీ చైర్మన్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: పాఠశాల అభివృద్ధికి ఎస్‌ఎంసీ కమిటీలు కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. నిడగల్లు ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులను సోమవారం ఆయన సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ నాయకులు బి.శ్రీరాములునాయుడు, అంబటి కృష్ణంనాయుడు, గాజాపు శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, సర్పంచ్ రాయిపిల్లి ఆరుద్రమ్మ, పి.బలరాంనాయుడు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా మంతిన వాసుదేవరావునాయుడు, కార్యదర్శిగా పత్తిక చంద్రమోహన్, కోశాధికారిగా గొడ్డు చక్రవర్తి, గౌరవ అధ్యక్షుడిగా మజ్జి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా ఎస్‌జీఎఫ్ డీడీ గాంధీ మురళీకృష్ణ, ఎం.జాకబ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎంపీ రమణ, సాంబయ్య, విజయనగరం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటనాయుడు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

జిగురు అట్టలతో కీటకాలకు చెక్



పొలంలో ఏర్పాటుచేస్తున్న పసుపు జిగురు అట్టలు

బలిజిపేట: పంటపొలాల్లో పసుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయడం ద్వారా కీటకాల ఉధృతిని అడ్డుకోవచ్చని ఏఓ శ్రావణ్ కుమార్‌నాయుడు అన్నారు. మండలంలోని సుభద్ర గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పొలంలో సోమవారం పసుపు జిగురు అట్టలను ఏర్పాటు చేసి, రైతులకు అవగాహన కల్పించారు. పసుపురంగును పురుగులు, దోమలు ఎక్కువగా ఆకర్షిస్తాయని, ఈ కాగితాలకు రెండు వైపులా జిగురు పూయడం వల్ల కీటకాలు వాటికి అంటుకుని ఎగరలేక చనిపోతాయని అన్నారు. వీటిని ఏర్పాటుచేయడం వల్ల పొలంలో దోమలు, క్రిమికీటకాలను గుర్తించడంతో పాటు వాటిని కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. రైతులు తమ పొలాల్లో వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ హేమంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయాలని ఎస్సై జి. కళాధర్ సూచించారు. సోమవారం స్థానిక పాలకొండ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

సమస్యలపై స్పందించాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఎల్‌ఓలు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కీలక విధులు నిర్వహించిన బీఎల్‌ఓల సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బాలమురళీకృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు మాట్లాడుతూ, ఇతర నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలకు రూ.10 వేలు అందిస్తే పాలకొండలో మాత్రం 4 వేల రూపాయలు మాత్రమే అందించారని తెలిపారు. ఎన్నికల సమయంలో సాధారణ ఖర్చులు తామే భరించామని వాపోయారు. దీనికి తోడు టీఏ, డీఏ కూడా అందించలేదని తహసీల్దార్‌కు బీఎల్‌ఓలు సాయి, రాజా, తదితరులు తెలిపారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

పేదల పెన్నిధి.. రైతు బాంధవుడు.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వాడవాడలా సోమవారం జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, రైతు రుణమాఫీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గూడుకట్టుకున్న నాయకుడు రాజన్న అంటూ కొనియాడారు. రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమర్‌రహే..అంటూ నినాదాలు చేశారు.

– పార్వతీపురం/సాలూరు నెట్‌వర్క్



సీతానగరం: పెదంకలాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బి.రవణమ్మ, నాయకులు



బలిజిపేట: పణుకువలసలో..



పార్వతీపురంటౌన్: పట్టణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు



సాలూరు: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, తదితరులు



మక్కువ: మండల కేంద్రంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, నాయకులు



బలిజిపేట: బలిజిపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, తదితరులు



సీతానగరం: మండల కేంద్రంలో మహానేత విగ్రహం వద్ద జోహార్ వైఎస్సార్ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సాలూరు రూరల్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సువ్వాడ, దండి, పెద్దింటి, తదితరులు



సీతానగరం: లచ్చయ్యపేటలో మహానేత చిత్రపటానికి పూలమాల వేసిన జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, స్థానిక ప్రజాప్రతినిధులు



బలిజిపేట: అరసాడలో..

రాజన్నదొరకు రైతుల వినతి



రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సాలూరు: రీసర్వే చేసిన గ్రామాల్లో తలెత్తిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరని పలువురు రైతులు, నాయకులు కోరారు. పట్టణంలోని రాజన్నదొర నివాసంలో సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. అన్నంరాజువలస పంచాయతీ తుపాకివలస రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వే పూర్తయిందని, ఆయా భూములకు నేడు ఆన్‌లైన్‌లో 1బీ రావడం లేదని, దీంతో బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకోలేకపోతున్నామని, గతంలో ఈ భూములపై తీసుకున్న రుణాలు బ్యాంకు అధికారులు రెన్యువల్ చేయడం లేదని వాపోయారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు భూములు అమ్ముకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని రాజన్నదొరను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని వినతి



డీఎంహెచ్‌ఓ పార్వతికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్: ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని యూనియన్ నాయకులు వి.ఇందిర డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరి 9న నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల మేరకు జీఓలు విడుదల చేయాలని కోరుతూ డీఎంహెచ్‌ఓకు సోమవారం వర్కర్స్ యూనియన్ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో ఒప్పందాల జీఓలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్, అదనపు పనులు, పనిచేయని సెల్‌ఫోన్‌లతో ఆశ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 3న మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆశ వర్కర్లంతా మెడికల్ ఆఫీసర్స్‌కు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు వేయాలని, కంప్లైంట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మహిళా సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఎం.శివాని, కృష్ణవేణి, పద్మ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో రహదారి గోతుల పూడ్చివేత



చిన్నారాయుడుపేట వద్ద రహదారి గోతుల పూడ్చివేతను పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో ఏర్పడిన గోతుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గోతులు పూడ్చివేతపై పోలీసులు దృష్టి సారించారు. చిన్నారాయుడుపేట వద్ద రహదారి గోతులను ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం పూడ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రాయగడ–విశాఖపట్నం రహదారిలో చిన్నారాయుడుపేట–గుచ్చిమి, కాశీపేట–పణుకుపేట, లచ్చయ్యపేట–పాతబొబ్బిలి, కాశీపేట–చినబోగిలి గ్రామాల మధ్య రహదారి గోతులు ఏర్పడ్డాయని అన్నారు. దీని వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రహదారి గోతులు పూడ్చివేతకు, అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రజలు, వాహన చోదకులు సహకరించాలని కోరారు.

రెగ్యులర్ వైద్యులను నియమించాలి



బెలగాం యూపీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ఆస్పత్రుల్లో రెగ్యులర్ వైద్యులను నియమించాలని, మందులను పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని సీపీఎం నాయకుడు రెడ్డి వేణు కోరారు. పట్టణంలోని యూపీహెచ్‌సీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని, ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత డిసెంబరు నెల నుంచి ఆస్పత్రుల్లో రెగ్యులర్ వైద్యులు లేరని, ఇన్‌చార్జి వైద్యులు వారంలో రెండు మూడుసార్లు వస్తుండటంతో మిగిలిన రోజుల్లో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, ఫీవర్ మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 4న పార్వతీపురం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద, అలాగే 4,5,6 తేదీల్లో కురుపాం, సాలురు, పాలకొండ సీహెచ్‌సీలు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటరమణ, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ




మాజీ సర్పంచ్ అప్పలనాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



నాగేశ్వరరావు యోగక్షేమాలు అడిగితెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, కృష్ణారాయపురం మాజీ సర్పంచ్ ఆర్.అప్పలనాయుడును వైఎస్సార్‌సీపీ పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం పరామర్శించారు. కృష్ణాయపురం మాజీ సర్పంచ్ ఆర్.అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో కొద్ది రోజులు విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్సతీసుకుని ఇంటికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జోగారావు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బూర్జలో పార్టీ సీనియర్ నాయకుడు వి.నాగేశ్వరరావును పరామర్శించి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ బి.రవణమ్మ, పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, బి.ముకుందరావు, బి.ఉమామహేశ్వరరావు, ఆర్వీ పార్థసారథి, సుమిత్రాపురం సర్పంచ్ బి.నందిని, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు జి.ఆదినారాయణ, బూర్జ మాజీ సర్పంచ్ ఎం.అప్పలనాయుడు, సర్పంచ్ జి.దాసు, తదితరులు ఉన్నారు.

'ఏకలవ్య' విద్యార్థికి పాముకాటు



అస్వస్థతకు గురైన ఏకలవ్య పాఠశాల విద్యార్థి ఆరిక వరుణ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఆరిక వరుణ్‌ను పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఎస్.పెంటన్న హుటాహుటిన భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి బాధిత బాలుడిని తరలించారు. పరీక్షించిన వైద్యులు పాముకాటే అని నిర్ధారించలేదు. ప్రాథమిక వైద్య సేవలందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. భద్రగిరి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన విద్యార్థిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కుక్కకాటుతో వ్యక్తికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గ్రామానికి చెందిన పువ్వల వీరస్వామిపై సోమవారం సాయంత్రం వీధికుక్క దాడిచేసి గాయపరిచింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే భద్రగిరి సీహెచ్‌సీకి తరలించి వైద్య అందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పార్వతీపురం / సాలూరు

9010204441, 9951602891

Office mail : vzmadvt@gmail.com

- అధ్వానంగా మారిన సాలూరు–మక్కువ రోడ్డు
- రహదారి గుంతల కారణంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు
- పట్టించుకోని మంత్రి సంధ్యారాణి, అధికారులు

గుంతలమయం..





పాయకపాడు వద్ద రహదారి గోతిలో ఇరుక్కుపోయిన లారీ

సాలూరు: మండలంలోని బాగువలస మీదుగా మక్కువ వెళ్లే రహదారి పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. గోతుల కారణంగా తరచూ వాహనాలు మొరాయిస్తున్నాయి. ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం సురక్షితం కాదని భావించి ఆర్టీసీ అధికారులు పది రోజులుగా బస్సు సర్వీసులను నిలిపివేశారు. దీంతో సాలూరు, మక్కువ, బొబ్బిలి మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఈ రోడ్డులో ఆటో కూడా తిరగని పరిస్థితి. గుంతల్లో నీరు చేరడంతో వాటిని గుర్తించలేక వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. ఈ మార్గంలోనే రూరల్ పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయ శాఖ, వెలుగు, తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలన్నీ ఉన్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చేవారంతా నిత్యం నరకం చూస్తున్నారు. అయినా స్థానిక మంత్రి సంధ్యారాణి, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాలూరు నుంచి మక్కువ వరకు 19.60 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.55.56 కోట్లు మంజూరు చేసింది. రూ.38.52 కోట్లతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో 2021 మార్చి 1న రోడ్డు పనులు ప్రారంభించారు. 6 కిలోమీటర్ల మేర మెటల్ లేయర్ వేశారు. 32 కల్వర్టులకు గాను 16 కల్వర్టులు, 8 మైనర్ బ్రిడ్జిలకు గాను 3 బ్రిడ్జిలు నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉంది.

ప్రయాణికులు భద్రత దృష్ట్యా..

బాగువలస మీదుగా సాలూరు–మక్కువ రోడ్డు గోతులతో నిండిపోయి ఉంది. ఈ రోడ్డులో బస్సు సర్వీసులు నడపడం కష్టంగా మారింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్టీసీ సర్వీసులను తాత్కాలికంగా నిలుపుదల చేశాం. ఈ రోడ్డు బాగుచేస్తామని ఇటీవల మక్కువ మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు తెలిపారు. రోడ్డు బాగుచేసిన వెంటనే బస్సు సర్వీసులు పునరుద్ధరిస్తాం.

– భాస్కరరెడ్డి, ఆర్టీసీ డీఎం, సాలూరు